

కార్పొరేషన్ కమిషనర్‌కు సన్మానం



కార్పొరేషన్ కమిషనర్‌ను సన్మానిస్తున్న లైన్స్‌క్లబ్‌సభ్యులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల కార్పొరేషన్‌కు నూతనంగా నియమితులైన కమిషనర్ శివాజీని శుక్రవారం లైన్స్‌క్లబ్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. లైన్స్‌క్లబ్,రెడ్‌క్రాస్ ఆర్గనైజేషన్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను కమీషనర్‌కు వివరించారు. నేడు మంచిర్యాల కోర్టు ప్రాంగణంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320జీ క్యాబినెట్ మైక్రో మెంబర్ మధుసూదన్‌రెడ్డి, సభ్యులు రామాంజనేయులు, వినయ్‌కుమార్,మహేందర్, శ్రీనివాస్ రెడ్డి, అనిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

భీమారం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు భీమారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ నెల 13న నిర్వహించిన పోటీల్లో వైష్ణవి, కార్తీక్,రాఖీ, రాకేష్, చరితేజ్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 18,19 తేదీల్లో హైదరాబాద్ పోటీల్లో పాల్గొంటారన్నారు. శుక్రవారం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు.

ప్లాస్టిక్ కట్టడి ఎలా..?



- విచ్చలవిడిగా కవర్లు, వస్తువులు వినియోగం
- నియంత్రించడంలో మున్సిపాలిటీల నిర్లక్ష్యం
- వ్యాపారులకు అవగాహన కల్పించే యోచన
- మారకుంటే నేరుగా చర్యలకు శ్రీకారం
- గతంలో తనిఖీ అధికారులపై దాడులు

మంచిర్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నగరంతోపాటు జిల్లాలోని లక్షెట్టిపేట, క్యాతన్‌పల్లి, మందమర్రి, చెన్నూరు, బెల్లంపల్లి మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను వ్యాపారులు విచ్చలవిడిగా విక్రయిస్తుండగా, వినియోగదారులు సైతం వాటిని విరివిగా వాడుతున్నారు. మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలో ప్రతీ రోజు చెత్త సేకరణలో సగానికంటే ఎక్కువ ప్లాస్టిక్ వస్తువులే లభిస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకంద్వారా అనేక ఆరోగ్యపరమైన సమస్యలు వస్తున్నాయని ప్రజలకు తెలిసినప్పటికీ అనివార్యంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను వాడుతున్నారు. తద్వారా ప్రజలు క్యాన్సర్‌తో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా...

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంచిర్యాల, నస్పూర్, శ్రీరాంపూర్‌లలో పదుల సంఖ్యలో హోల్ సేల్ ప్లాస్టిక్ విక్రయషాపులు ఉన్నాయి. వాటి నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ల మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను మాత్రమే విక్రయించాలి. కానీ కొందరు వ్యాపారులు 120 మైక్రాన్ల మందం ఉన్నట్లు నకిలీ ముద్రను వేసి మరీ కవర్లు యథేచ్ఛగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరి కొందరు బల్దియా సిబ్బంది, రాజకీయ నేతల అండదండలతో ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రతీరోజు మంచిర్యాల నగరం నుంచి దాదాపు వంద టన్నుల ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నా... అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు విమర్శలు వస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు....

మంచిర్యాల నగరంలోని మార్కెట్‌రోడ్, స్టేషన్ రోడ్, శ్రీనివాస టాకీస్ రోడ్డులో ఉన్న హోల్‌సేల్ షాపులలో పెద్దమొత్తంలో ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలతో పాటు బార్లు, రెస్టారెంట్లు, మటన్ షాపులు, చికెన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కూరగాయల విక్రయ వ్యాపారులకు, కిరాణ షాపులకు సప్లయి అవుతున్నాయి. అడ్డగోలుగా ప్లాస్టిక్ దందా జరుగుతున్నా ఏ అధికారి కన్నెత్తి చూడక పోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొంతమంది బల్దియా సిబ్బంది ఆయా హోల్‌సేల్ దుకాణాల్లో మామూళ్ల వసూలు చేస్తున్నారన్న అభియోగాలు సైతం ఉన్నాయి. సింగిల్ యూజ్ బ్యాగులు వాడాలని సిబ్బంది అవగాహన కల్పించకపోవడంతో ప్లాస్టిక్‌వాడకం విచ్చలవిడిగా మారింది. గతంలో జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ నిశేధంకోసం ప్రత్యేకచర్యలు చేపట్టేవారు. దుకాణాలలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ, భారీగా ఫైన్‌లు వేయడం ద్వారా ప్లాస్టిక్ వాడకంపై ఉక్కుపాదం మోపేవారు. దీంతో అపట్లో కొంత మేరకు నియంత్రణ జరిగింది. అయితే అప్పటి అధికారులు, సిబ్బందికి బదిలీలు కావడంతో తనిఖీలు నిలిచిపోయాయి. దీంతో పరిస్థితి ఎప్పటిలాగే తయారైంది.

సానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై వ్యాపారి దాడి..

ప్లాస్టిక్ తనిఖీల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఓ హోల్‌సేల్ షాపునకు వెళ్లిన మున్సిపల్ అధికారిపై 2020 డిసెంబరు 7న చోటు చేసుకుంది. స్వచ్ఛ సర్వేక్షన్-2021లో భాగంగా స్థానిక శ్రీనివాస టాకీస్ రోడ్డు లోగల ఓ ప్లాస్టిక్ షాపులో అప్పటి సానిటర్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, జవాను కుంటాల రాజలింగుల నేతృత్వంలో...

(తరువాయి 7లో)

బస్ డిపో నిర్మాణం చేపట్టాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్



బస్ డిపో ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులో ఆగిపోయిన బస్ డిపో నిర్మాణం తక్షణమే చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం చెన్నూరులో అసంపూర్తిగా ఉన్న బస్‌డిపో నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. చెన్నూరు ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన బస్ డిపో నిర్మాణం ఆగిపోవడం శోచనీయమన్నారు. ఇటీవల ప్రారంభించిన పనులు ఆగిపోవడంతో ప్రజల ఆశ నిరాశే అయ్యిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో బస్సుడిపో నిర్మాణం 80శాతం పూర్తి అయ్యిందని, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని వెంటనే బస్ డిపో నిర్మాణం పూర్తి చేయాలన్నారు. చెన్నూరుకు సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత బస్సులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే హైద్రాబాద్‌కు ఉదయం వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో గోదావరిఖని, మంచిర్యాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. చెన్నూరు నుంచి మహారాష్ట్ర, కాళేశ్వరం, ఛత్తీస్‌గడ్ ప్రాంతాలకు రద్దీ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రభుత్వం స్పందించి నిలిచిపోయిన బస్ డిపోను వెంటనే పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి, జిల్లాప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్, రమేష్, శ్రీనివాస్, శ్రీపాల్, శివకృష్ణ, వంశీ, రామయ్య పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● కలెక్టర్ కుమార్ దీపక్



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఈ క్రమంలో వేసవి కాలంలో ప్రజలకు నిరంతరం శుద్ధమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం చెన్నూరు మండలంలోని బతుకమ్మ వాగు సమీపంలోని తాగునీటి ట్యాంక్‌తోపాటు బట్టిగూడ గ్రామంలోని తాగునీటి ట్యాంక్‌ను చెన్నూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకుని నిరంతరాయంగా శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. పైపులైన్ల మరమ్మత్తులు ఇతర సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు.

అమృత్ 2.0 పథకంలో నిర్మిస్తున్న తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులను వేగవంతం చేసి ఈ వేసవిలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని ఆందోళన



డీఎఫ్‌వో, ఎఫ్‌డీపీటీ శాంతరాంకు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

జన్నారం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్ పరిధిలో ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌ఆర్‌ఎస్ రెసిడెన్సీ వద్ద అధికారులు సమావేశం నిర్వహిస్తున్నారని తెలుసుకున్న మండల వాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు భూమాచారి, సోయెల్‌లు మాట్లాడుతూ జన్నారం డివిజన్‌లో ఆంక్షల పేరుతో స్థానికులను అటవీ శాఖ చెక్‌పోస్టు ద్వారా రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటలకు వాహనాలు నిలిపివేస్తున్నారని, స్థానికులను కూడా వెళ్లనివ్వడం లేదన్నారు. అనంతరం ఎఫ్‌డీపీటీ శాంతరాం, డీఎఫ్‌ఈవో శివ్‌ఆశిష్‌సింగ్ బయటకు రావడంతో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ముత్యం సతీష్, జక్కుల సురేష్ పాల్గొన్నారు.

ప్రారంభమైన గాంధారిఖిల్లా జాతర

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలో ఆదివాసీ నాయకపోడ్ సేవాసంఘం ఆధ్వర్యంలో గాంధారిఖిలా మైసమ్మ జాతర శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే జాతరలో మొదటి రోజు సదర్ భీమన్న గజాలతో నాయకపోడ్ పూజారులు, కుల పెద్దలు పాదయాత్రగా గోదావరికి నదికి తరలి వెళ్లారు. గోదావరిలో సదర్ గజాలను శుద్ధిచేశారు. అనంతరం గంగాజలాన్ని తీసుకువచ్చి గాంధారిఖిలాలోని దేవతామూర్తులను శుద్ధి చేశారు. జాతరను కలెక్టర్ కుమార్ దీపర్ పరిశీలించారు. జాతరను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని నాయకపోడ్ సంఘం నాయకులకు సూచించారు. అనంతరం జాతర సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం గౌరవాధ్యక్షుడు లౌడం రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, పంచాయతీ కార్యదర్శి విద్యాలత, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



సదర్ భీమన్న గజాలతో గోదావరి నదికి వెళ్తున్న గ్రామస్తులు

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



విధులు బహిష్కరించిన మంచిర్యాల బార్ అసోసియేషన్ సభ్యులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా కోర్టులో మహిళ జడ్జి హరీషపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం మంచిర్యాల కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ జడ్జికి వినతి పత్రం అందజేశారు. బార్ అసోసియేషన్‌సభ్యులు మాట్లాడుతూ మహిళ జడ్జిపై దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

లక్షెట్టిపేటలో..

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణ న్యాయస్థానంలో న్యాయవాదులు శుక్రవారం తమవిధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ కరువైందని పోరాటం చేస్తున్న తరుణంలో న్యాయమూర్తులపై కూడా రోజు రోజుకు దాడులు అధికమవుతున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లలోని 9వ అడీషనల్ జిల్లా న్యాయమూర్తి హరీషపై ఫోక్సో కేసు నిందితుడు కోర్టు హాలులోనే దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండిచారు. వెంటనే నిందితుడిని ఖఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. అంతే కాకుండా త్వరగా న్యాయ వాదులకు రక్షణ చట్టాని తీసుకురావాలిన ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, బుద్దె సత్యం, సురేందర్, కొమురెడ్డి సత్తన్న, అక్కల శ్రీధర్, కారుకూరి సురేందర్, రాజేశ్వర్, పద్మ, ప్రదీప్, నళినికాంత్, సుమన్, ప్రకాశం పాల్గొన్నారు.

కాసిపేటను వంద శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కాసిపేటను వంద శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో వలంటీర్లు, సూపర్ వైజర్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై పాల్గొని మాట్లాడారు. కలిసి వయోజన విద్య, మైనార్టీ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో కాసిపేట మండలంలో 100 రోజుల్లో వంద శాతం అక్షరాస్యత సాధించాలని, ఇందుకోసం అన్ని శాఖల సహాయ సహకారాలు అందించాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కాసిపేట మండలంలో 2005 మంది మహిళలు, 1,447 మంది పురుష నిరక్షరాస్యులకు చదువు నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా వయోజన అధికారి పురుషోత్తం నాయక్, డీఆర్‌డీవో కిషన్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి రాజేశ్వరి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, డీఈవో లలిత, సెక్టోరల్ అధికారి చౌదరి, క్వాలిటీ ఎడ్యుకేషన్ సమన్వయకర్త సత్యనారాయణమూర్తి, సమన్వయకర్తలు, సూపర్ వైజర్లు, ఆర్‌పీలు పాల్గొన్నరు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. రాజీవ్ నగర్ మోడల్ పాఠశాలలో తెలంగాణ మిషన్ పరివర్తనలో భాగంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు అయితే వారి సమాచారాన్ని 100 డయల్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, ప్రిన్సిపాల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

గర్మిళ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వేంపల్లి గ్రామ శివారులో ఇండస్ట్రియల్ హబ్ ఐటీపార్కు ఏర్పాటుకోసం చేస్తున్న భూముల విషయంలో రైతులకు న్యాయం చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బాధిత రైతులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల నుంచి సేకరిస్తున్న 300 ఎకరాల భూమికి ఎకరానికి రూ.13 లక్షల పరిహారం ప్రకటించడం చాలా దారుణమన్నారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్నా పరిహారం తక్కువగా నిర్ణయించారని, ప్రస్తుతం అక్కడ పట్టా భూమికి ఎకరానికి రూ. 50 లక్షలు పలుకుతుందన్నారు. ఈ భూములు ఎక్కువగా ఎస్సీలకు చెందిన వారివే ఉన్నాయని తెలిపారు. ప్రైవేటురంగం ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కు పేరిట రూ.13లక్షలు ఎకరానికి చెల్లించడం దారుణమని, 2013 యాక్ట్ భూసేకరణ చట్టం ప్రకారం అసైన్డ్ భూములకు సైతం పట్టా భూమితో సమానంగా పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఈ యాక్ట్ ప్రకారం ఆ ప్రాంతంలో జరిగిన లావాదేవీలను పరిగనలోకి తీసుకుని మూడు రెట్లు పరిహారం పెంచి ఇవ్వాలన్నారు.

ఇక్కడ ప్రభుత్వ వాల్యూ ప్రకారం ఎకరానికి రూ. 6.50 లక్షలు ఉందని, కాబట్టి దానికి మూడురెట్లు కలిపి రూ. 26లక్షలు చెల్లించాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు తాము రైతుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్, మాజీ సర్పంచులు బేర పోచయ్య, మంచాల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, నాయకులు రావుల వెంకటేష్, కుడుక సత్యం, బాధితులు శేఖర్, సతీష్ పాల్గొన్నారు.

ఆదర్శం.. పిలుస్తోంది

- మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ
- 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీలు
- దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 28 వరకు గడువు
- ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష... జిల్లాలో ఐదు ఆదర్శ పాఠశాలలు

7

గ్రామస్థుల చందాలతో ఢిల్లీకి.. గిన్నిస్ రికార్డుతో గ్రామానికి..

6

రాష్ట్ర సుభిక్షం కోసం యాగాలు...

● కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ



సమావేశంలో మాట్లాడుతున్న స్వరూపానంద స్వామీజీ



నస్పూర్‌లో ఏర్పాటు చేసిన యాగశాలలు

నస్పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, సుబిక్షంకోసం యజ్ఞ యాగాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ కృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ అన్నారు. శ్రీ వైష్ణవ అయుత చండీ అతిరుద్రం 86వవిశ్వశాంతి మహాయాగ మహోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా శుక్రవారం నస్పూర్‌లోని యాగశాల అవరణ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 15వ తేది నుంచి వచ్చేనెల 2 వరకు 16 రోజుల పాటు మహాయాగ మహోత్సవం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన యాగశాలల నిర్మాణ పనులు పూర్తయినట్లు పెర్కొన్నారు. యాగంలో పాల్గొనే సౌలభ్యం అందరికి కల్పించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సుభిక్షమైన పరిపాలన అందించాలని, పాడి పంటలు బాగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు స్వామీజీ తెలిపారు. హోమంలో కూర్చునే వారి పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పూజా కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. శనివారం గణపతి పూజతో యాగ కార్యక్రమాలు మొదలు అవుతాయని స్వామీజీ తెలిపారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు...

విశ్వశాంతి కోసం నిర్వహించే మహాయాగ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రోజు దాదాపు 10వేల మంది భక్తుల దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు జరిగాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అల్పాహారం, తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమం ఉంటుంది. 15వ తేదీ శనివారం గణపతి పూజతో ప్రారంభమవుతాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్ద ఎత్తున జాగరణ, శివపార్వు తుల కల్యాణ మహోత్సవం జరుగుతుంది. మహాపూర్ణాహుతి, రాధాకృష్ణ కల్యాణం, శ్రీరాధా గోవింద పట్టాభిషేక మహోత్సవంతో మహాయాగ పూజలు ముగుస్తాయి.

615 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీలు

చెన్నూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై సివిల్ సప్లయి, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న దాదాపు 615 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన రూ. 30 లక్షలు విలువ చేసే బియ్యాన్ని మూడు వాహనాల్లో చెన్నూరు ప్రాంతం మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు అధికారులు జాతీయ రహదారిపై మాటు వేశారు. రెండు లారీలు, ఒక బొలేరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని చెన్నూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లా సివిల్ సప్లయి అధికారి వేణుగోపాల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పోచయ్య స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పంచనామా నిర్వహించి చెన్నూరు సివిల్ సప్లయి గోదాంకు తరలించారు. వాహనాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బారెగూడలో ఏడు క్వింటాళ్లు..

బెజ్జూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు అక్రమంగా తరలించేందుకు నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యంను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన రేణికుంట సంతోష్ ఇంట్లో పక్కా సమాచారం మేరకు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించామని చెప్పారు. మహారాష్ట్రకు తరలించేందుకు నిలువ ఉన్న బియ్యం లభ్యమయ్యాయని తెలిపారు. బియ్యాన్ని స్వాధీన పర్చుకొని సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాంకిడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలని గోయగాం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ఉడతల సురేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సిర్పూర్(టి) నుంచి ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రలోని గడిచాందూర్‌కు వెళ్తుండగా ప్రమాదవ శాత్తు అదుపు తప్పి పడిపోయాడు. దీంతో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పత్రం అందుకుంటున్న కళాకారులు


ఢిల్లీలో నృత్య ప్రదర్శనలో పాల్గొన్న దంతన్‌పల్లి కోలాం గిరిజనులు

గ్రామస్థుల చందాలతో ఢిల్లీకి.. గిన్నిస్ రికార్డుతో గ్రామానికి

- గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో దంతన్‌పల్లి వాసుల ప్రదర్శన
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించిన కళాకారులు

తిర్యాణి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కళాకారులు గ్రామస్థులతో చందాలతో ఢిల్లీకి చేరుకుని గిన్నిస్ రికార్డుతో రావడంతో గ్రామస్థులు ఆనందం అంబరాన్నంటింది. గణతంత్ర దినోత్సవం సం దర్భంగా ఢిల్లీలో ఐదు వేల మంది గిరిజన కళాకారులతో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని దంతన్‌పల్లికి చెందిన 15 మంది పాల్గొన్నారు. ఈ కళాకారుల గుస్సాడీ ప్రదర్శనను గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వారు గుర్తించారు.

మారుమూల ప్రాంతం నుంచి..

దట్టమైన అడవులు, కొండ కోన సెలయేర్ల మధ్య అత్యంత మారుమూల ప్రాంతమైన తిర్యాణి మండలానికి చెందిన దంతన్‌పల్లి గ్రామంలో నివసించే 15 మంది కళాకారుల బృందం నృత్య ప్రదర్శనలో పాల్గొన్నది. అత్యంత వెనకబడిన పీవీటీజీ తెగకు చెందిన కొలాం గిరిజనులు 2016లో 15 మంది సభ్యులతో గుస్సాడీ కళా బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. భారతదేశం విభిన్న సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు. అందులో గిరిజనుల జీవశైలీ వారి నృత్య రీతి, ఆచార సంప్రదాయం ప్రకృతితో ముడి పడి ఉంటాయి. వారి జీవన విధానంతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు ప్రకృతిని మైమరిపించేలా ఉంటుంది.


ఢిల్లీలో గుస్సాడీ కళాకారుల ప్రదర్శన (ఫైల్)

గిరిజనుల జీవన విధానం..

ఆయా రాష్ట్రాల్లో గిరిజనుల జీవన విధానం, నృత్య రీతులు ఆయా ప్రాంతాలకు తగినట్లుగా వేర్వేరుగా ఉంటాయి. ఆయా రాష్ట్రాల్లో నిర్వహించే జాతరలు, ఉత్సవాలు, పెళ్లిళ్ల సందర్భంగా వారు నిర్వహించే కార్యక్రమాలు చూసి ఓ కళా బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అంతరించి పోతున్న సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో 2016లో 15 మంది కొలాం గిరిజనులు గుస్సాడీ కళాబృందంగా ఏర్పడ్డారు. వీరి ఆర్థిక స్థితులు అంతంత మాత్రమే. ఇప్పటికీ పోడు వ్యవసాయాన్నే నమ్ముకుని కుటుంబా లను పోషించుకుంటున్నారు. అలా అష్టకష్టాలు పడి ఢిల్లీకి చేరుకుని తాము నమ్ముకున్న కళను గుర్తించేలా చేశారు. సంగీత నాటక అకాడమీ కళాప్రదర్శన కోసం నిర్వహించిన కార్యక్రమానికి కళాకారులను ఆహ్వానించారు. నాటక అకాడమీ ప్రకటన చూసి కోలాం గిరిజనులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సంగీత నాటక అకాడమీ వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఫైనల్‌కు ఎంపికయ్యారు. సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఐదు వేల మంది కళాకారులతో నిర్వహించిన ప్రదర్శనలో విభిన్న జాతుల గిరిజన సంస్కృతిని గుస్సాడీ నృత్యం ద్వారా తెలిపి గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నారు.

కళను బతికించుకోవాలనే తపన..
గంగారాం, కొలాం గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దంతన్‌పల్లి



గుస్సాడీ కళను బతికించుకోవాలనే తపనతోనే 15 మందితో గ్రూపు ఏర్పాటు చేశారు. ఢిల్లో ప్రదర్శన ద్వారా గిన్నిస్ రికార్డుతో గ్రామ గౌరవాన్ని నిలబెట్టాం. కానీ మేము ఢిల్లీ వెళ్లేందుకు ఎన్నో అవస్థలు పడాల్సి వచ్చింది. ఆర్థికంగా సాయం అందించాలని అధికారు లకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకునే వారు కరువయ్యారు.

గిన్నిస్ రికార్డుతో ఆనందం..
ఆత్రం బాపురావు, గుస్సాడీ నృత్య కళాకారుడు, దంతన్‌పల్లి



మారు మూల ప్రాంతమైన తిర్యాణి మండలం దంతన్‌పల్లి గ్రామానికి చెందిన కోలాం గిరిజన నృత్య కళాకారులు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కడం చాలా ఆనందంగా ఉంది. ఢిల్లీలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న గుస్సాడీ నృత్యాల కళా ప్రదర్శనలో మేం గుర్తింపు పొందడం మరిచిపోలేని అనుభూతి.



మార్చిలోగా పనులు పూర్తవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు మార్చి నెలాఖరులోగా పూర్తవ్వాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కు మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అదనపు గదులు, మూత్రశాలలు, ప్రహరీ గోడ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, భవన మరమ్మతులు, సైన్స్ ల్యాబ్, తరగతి గదుల్లో ఫ్యాన్లు, వెలుతురు, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థినుల స్వీయరక్షణకు కరాటేలో శిక్షణ వంటి పనులు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. పనులు మార్చి చివరి కల్లా పూర్తి చేయాలని, వచ్చే విద్యా సంవత్సరానికి సిద్ధం చేయాలని తెలిపారు. సమావేశంలో ప్రణాళిక సమన్వయక కర్త అబిద్ అలీ, జిల్లాలో ప్రధాన మంత్రి శ్రీ పథకం కింద ఎంపికైన 18 పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎంపీపీఎస్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల ప్రత్యేకాధికారులు, ప్రధానో పాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖాధికారులు, ప్రత్యేకాధికారులు, ఎస్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు తప్పని సరిగా వినియోగిం చుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు ప్రకటించామని తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, అధికారులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విధుల్లో వెసులుబాటు కల్పించనున్నారని పేర్కొన్నారు. ఆయా సంస్థల యజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని సూచించారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి


వేలాల గట్టు మల్లన్న ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

జైపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ నెల 26 నుంచి నిర్వహించే గట్టుమల్లన్న జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం వేలాల గట్టుమల్లన్న ఆలయంను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గోదావరి ప్రాంతాన్ని సందర్శించి నీటి ప్రవాహం ఎక్కు వగా ఉన్న చోట జాలర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ ప్ర దేశాల ను ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారని శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్‌ను అడిగి తెలుసుకున్నారు. గోదావరి నీరు దూర ప్రాంతంలో ఉన్నందున భక్తులు ఇబ్బందులు పడకుండా స్నాన ఘట్టాల వద్ద కులాయిలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏసీపీ వెంట ఎస్ఐ శ్రీధర్, వేలాల ఆలయ కమిటీ సభ్యులు నగేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పేకాట నిందితుల బైండోవర్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తారీకున బలరావుపేట శివారులో పేకాట ఆడుతు పట్టుబడిన ఏడుగురు నిందితులను శుక్రవారం తహసీల్దార్ దిలీప్ కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. లక్ష రూపాయల పూచికత్తుపై బైండోవర్ చేశామన్నారు. పేకాట, జూదం ఆడితే ఎవరిని వదిలి పెట్టిది లేదని ఎంతటివారైనా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

బీఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ ఎత్తివేయాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని, డిటెన్షన్ విధానం ఎత్తివేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో రెండు ఫార్మసీ కళాశాలు ఉన్నాయని, ఎక్కువ మంది విద్యార్థులు డిటెన్షన్ అవడం, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు లేకపోవడం వంటి వాటితో ఫార్మసీ విద్యకు దూరమవు తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

‘హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం’

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ సెక్రెటేరియట్ సభ్యుడు డి బ్రహ్మానందం అన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్‌లో పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీని వాటిని పూర్తిగా విస్మరించిం దన్నారు. 14 నెలలుగా అమలు విషయంలో పూర్తిగా విఫలమైంద ని చెప్పారు. రైతు భరోసా కింద ఎకరాకు 15 వేల రూపాయలు, మహిళలకు మహాలక్ష్మీ పథకం కింద ప్రతి మహిళకు నెలకు 2500ల రూపాయలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని చెప్పారు. వృద్ధాప్య పింఛన్ 4 వేల రూపాయలు, నిరుద్యోగ భృతి, ఇందిరమ్మ ఇళ్ళు, కళ్యాణలక్ష్మిలో భాగంగా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం వంటి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆయా హామీల అమలుకు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన చేపట్టిన చలో సెక్రెటేరియట్ నిర్వహిస్తున్నామని, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసనలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు వెంకన్న, అప్పారావు, శంకర్, సురేష్, రాంబాబు, రాజేష్, రాము, సతీష్, మల్లేశ్వరి, శిరీష, సత్యక్క, శారద, కవిత తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పాటుపడాలి


ఆశిష్ చట్టరీకి పుష్పగుచ్చం అందజేస్తున్న రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ తిరుపతి

దండేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ తిరుపతి అన్నారు. న్యూఢిల్లీలో ట్రైబల్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ చట్టరీని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. రాష్ట్రంలో గిరిజనుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి రిజన సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ తిరుపతి తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- సీడీపీవో మనోరమ

చెన్నూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టాలని సీడీపీవో మనోరమ కోరారు. శుక్రవారం పట్టణంలోని కొత్తగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌డ్రైవ్, అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేటి బచావో బేటి పడావో పథకం, కుల వివక్ష, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిషేధం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567, సైబర్ క్రైమం 1930, మిషన్ వాత్సల్య, ఆడ పిల్లల ప్రాముఖ్యతపై వివరించారు. ఆడ పిల్లల సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రమీల, సూపర్ వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీ, బాలింతలు, తల్లులు,పిల్లలు పాల్గొన్నారు.

నిబంధనలు మినహాయించాలి


డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తాండూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి కన్నా ఎక్కువ సంతానం ఉంటే ఎన్నికల్లో పోటీ చేసేలా నిబంధనలు మినహాయించాలని టీడీపీ మండల ఇన్‌చార్జీ దాసరి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యేలకు లేని నిబంధనలు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎందుకుని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. అలాగే విద్యార్హతలు ఉన్న వారే ఎన్నికల్లో పోటీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈనిబంధనల కారణంగా మేధావులు, విద్యా వంతులు, యువకులు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోతున్నారని చెప్పారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు సాలిగామ మల్లేష్, సీపీఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, అశోక్ పాల్గొన్నారు.



రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి

కాసిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాసిపేట 2వ గనిలో గురువారం ఒక్కరోజే 443 టబ్బుల ఫిల్లింగ్ ద్వారా 600 టన్నుల రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగిందని కేకే గ్రూపు ఏజెంటు రాందాస్, గనిమేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానికంగా శుక్రవారం వారు మాట్లాడారు. ఇదే ఉత్సాహంతో కార్మికులందరు పనిచేసి గనిని ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. రాబోయే రెండు నెలలు కూడా సమష్టి కృషితో ఉత్పత్తి సాధించి సంస్థ మనుగడకు పాటుపడాలని సూచించారు. అనంతరం ఉత్పత్తి చేసినకార్మికులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీలో కాంట్రాక్టు కార్మికులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంటాక్టు కార్మికులు వెట్టి చాకిరీలో మగ్గుతున్నారని ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు ఎండీ జాఫర్ న్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హక్కులు అమలు కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనం అమలు చేయడం లేదని, లీవులు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 20న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరి, రుక్మిణి, భారతి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాకు లారీల కొరత

- కాసిపేట 2వ గనిలో మైదానంలో పేరుకుపోతున్న నిల్వలు
- సింగరేణి సంస్థకు నష్టం


మైదాన ప్రాంతంలో నిల్వ చేసిన బొగ్గు నిల్వలు

కాసిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బొగ్గు రవాణా చేసేందుకు లారీల కొరతతో కాసిపేట 2వ గనిలో బొగ్గు నిల్వలు మైదాన ప్రాంతాంలో నిల్వ చేస్తున్నారు. దీంతో బొగ్గు నాణ్యత కోల్పోయి తక్కువ ధరకు విక్రయస్తున్నారని, సింగరేణి సంస్థకు తీరని నష్టం జరుగుతుందని కార్మికులు, కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మందమర్రి డివిజన్‌పరిధిలోని కాసిపేట 2వ భూగర్భ గని నుంచి కార్మికులు బొగ్గు వెలికి తీస్తున్నారు. దీన్ని సీఎస్పీ, ఇతర పరిశ్రమలకు తరలించేందుకు లారీలు లేకుండా పోయాయి. దీంతో బొగ్గు నిల్వలు మైదాన ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. దీంతో మైదాన ప్రాంతం బొగ్గుతో నిండిపోయింది. వారం రోజుల తర్వాత బొగ్గును లారీల్లోకి తరలించే క్రమంలో దానికున్న నాణ్యత తగ్గి రేటు తగ్గిపోతుంది. దీని ద్వారా సంస్థకు తీరని ఆర్థిక నష్టం జరుగుతుంది. వారం రోజులుగా బొగ్గు రవాణా చేసేందుకు లారీలు రాకపోవడంతో గని నుంచి తీసిన బొగ్గును ఎక్కడ వేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గత నెలలో కాసిపేట 2వ గని 11 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని చేసింది. కానీ బొగ్గు రవాణాలో నెలకొన్న పరిస్థితుల వల్ల సంస్థకు నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బొగ్గు వెంటనే వెంటనే రవాణా జరిగేలా చూడాలని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కోరుతున్నారు. ఈ విషయంపై గని మేనేజర్ లక్ష్మీనారాయణను వివరణ కోరగా బొగ్గు రవాణా చేసేలారీలు వారం రోజులుగా రావడం లేదని చెప్పారు. దీంతో వెలికి తీసిన బొగ్గును ఎక్కడ నిల్వ చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బొగ్గు రవాణా చేసే గుత్తేదారునిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తాం..
తహసీల్దార్ శ్రీనివాస్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకుంటాము. అంతేకాకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టినా కూల్చేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ భూముల కబ్జాలపై ఏలాంటి చర్యలు చేపట్టారు..?

తహసీల్దార్ : ప్ర భుత్వ భూములు కబ్జాలకు గురి కాకుండా చర్యల ను చేట్టాము. సర్వే నంబ రు 64లో చెరువు సమీపం లో కబ్జా చేసి షెడ్లలను వేయగా ఇటీ వల వాటిని తొలగించాము. ఇంకా ఇతర చోట్ల తొలగించేవి కొన్ని ఉన్నాయి. వాటిని కూడా తొందరగానే తొలగించి వేస్తాము. ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తాం. ప్రభుత్వ భూములు కాపాడేందుకు చర్యలను చేపట్టాము.

ఆంధ్రజ్యోతి : నస్పూర్‌లో ఏఏ సర్వే నంబర్లలో కోర్టు కేసులున్నాయి

తహసీల్దార్ : సర్వే నంబరు 42, 64, 72లో కోర్టు కేసులు ఉన్నాయి. ఇళ్ల స్థలాలు, వ్యవసాయ వినియోగంలో ఉన్న భూమి పోను మిగిలిన భూమిని పరిశీలిస్తున్నాము. సర్వే చేసి ఇంకా ఏమైన మిగులు భూమి ఉంటే తెలిపోతుంది. కొన్ని చోట్ల భూములపై కోర్టుల్లో కేసులు ఉన్నందున అందులోకి వెళ్లడంలేదు.

ఆంధ్రజ్యోతి : కుల, నివాస పత్రాల జారీ పెండింగ్‌లో ఉంటున్నాయా..?

తహసీల్దార్ : కుల, నివాస, ఆదాయ పత్రాల జారీలో ఏలాంటి ఆలస్యం జరగడంలేదు. మీ సేవా నుంచి వచ్చిన దరఖాస్తులు తర్వాత పరిశీలించి ఇస్తాము. దరఖాస్తుదారులు వారు తీసుకునే ధృవ పత్రాల కోసం సరైనా ఆధారాలను చూపని వాటికి రిజక్ట్ చేస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : రేషన్ కార్డులకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి..

తహసీల్దార్ : ప్రజా పాలన, వార్డు సభల్లో రేషన్ కార్డుల కోసం 4685 దరఖాస్తులు వచ్చాయి. రేషన్ కార్డుల్లో తమ కుటుబం సభ్యులను చేర్చాలని 632 మంది దరఖాస్తులు చేశారు. వచ్చిన దరఖాస్తులన్నింటిని పరిశీలించాము. డాటా ఎంట్రీ ప్రక్రియ పూర్తవుతోంది.

-నస్పూర్, (ఆంధ్రజ్యోతి)

ఆదర్శం పిలుస్తోంది



మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

- 6 నుంచి 10వ తరగత వరకు ఖాళీలు
- దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 28 వరకు గడువు
- ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష...

జిల్లాలో ఐదు ఆదర్శ పాఠశాలలు

కోటపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో నాణ్య మైన విద్యను అందించేందుకు జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అధునాతన సదుపాయాలు, అత్యుత్తమ ఫలితాలతో దూసుకుపోతున్న ఈ మోడల్ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని ఐదు ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రతి పాఠశాలలో 6వ తరగతిలో వంద సీట్ల చొప్పున మొత్తం 500 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. దరఖాస్తుల స్వీకరణ జనవరి 6 నుంచే ప్రారంభం కాగా ఈ నెల 28 వరకు గడువు ఉంది. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులకు ఇది సదవకాశమని చెప్పవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 14 పాఠశాలలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 14 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలోని మంచిర్యాల, కోటపల్లి, మందమర్రి, కాసిపేట, లింగాపూర్‌లలో, కొము రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూరు(యు)లో, ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్, బోథ్, జైనథ్, ఆదిలాబాద్, గుడి హత్నూర్, బజార్ హత్నూర్‌లలో, నిర్మల్ జిల్లాలోని కుంటాలలోని మోడల్ స్కూళ్లలో సీట్లను భర్తీ చేస్తారు. 6వ తరగతికి సంబంధించి ప్రతి పాఠశాలలో వంద సీట్ల చొప్పున 1400 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో తాజాగా ప్రవేశాలు కల్పిస్తారు.

అధునాతన వసతులు

ఆదర్శ పాఠశాలల్లో అధునాతన వసతులున్నాయి. పక్కా భవనాలతో పాటు విశాలమైన గదులు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, వృత్తి విద్యకు సంబంధించిన ఏర్పాట్లు కల్పించారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధిస్తూ సీసీ కెమెరాల ద్వారా విద్యార్థులను పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఎన్ఎంఎంఎస్, ఎంసెట్, నీట్‌కు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్‌లో బాలికలకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి ఉంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఇలా..

6 నుంచి 10వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. తెలంగాణ ఎంఎస్. సీజీజీ.జీవోవి. ఇన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఇందుకోసం ఆధార్‌కార్డు, బోనఫైడ్, కుల, ఆదాయ ధృవీ కరణ పత్రాలు, పాస్‌ఫోటోతో మీ సేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ. 125, జనరల్ విద్యార్థులు రూ. 200ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు ఈ నెల 28 చివరి గడువు కాగా ఈలోగా దరఖాస్తులు చేసుకుని హార్డ్‌కాపీని సంబంధిత ఆదర్శ పాఠశాలల్లో అప్పగిం చాలి. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. 6వ తరగతికి సంబంధించి పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, 7 నుంచి 10వ తరగతి ప్రవేశాలకు పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఆయా మోడల్ స్కూళ్లలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే పరీక్షలు జరుగుతాయి.

రాత పరీక్ష ఇలా..

తెలుగు, ఆంగ్లమాధ్యమంలో వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. 5వ తరగతి సామర్థ్యానికి అనుగుణంగా తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, ఆంగ్ల పాఠ్యాంశాలపై 25 మార్కుల చొప్పున ఐచ్చిక తరహాలో ప్రశ్నలు ఇస్తారు. వీటిలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశానికి అవకాశం కల్పిస్తారు. అయితే లోకల్ మండలానికి సంబంధించిన విద్యార్థుల ప్రవేశాల తర్వాతనే ఇతర మండలాల విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు.

ప్రవేశాల షెడ్యూల్

ఆన్‌లైన్ దరఖాస్తులు
06-01-2025 నుంచి 28-02-2025 వరకు
హాల్‌టికెట్ల డౌన్ లోడ్ 03-04-2025
ప్రవేశ పరీక్ష - 13-04-2025
సమయం - 6వ తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
7 నుంచి 10వ తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు.

గ్రామీణ విద్యార్థులకు మంచి అవకాశం: రాజశేఖర్, ప్రిన్సిపల్, కోటపల్లి ఆదర్శ పాఠశాల



గ్రామీణ నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది మంచి అవకాశం. కోటపల్లి మోడల్ స్కూల్‌లో మెరుగైన సౌకర్యాలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంతో అన్ని వసతులతో కూడిన ఆంగ్లమాధ్యమ విద్యను అందిస్తున్నాం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాం. పాఠశాలలో విద్యతో పాటు క్రీడలు, సైన్స్, గణిత మేళాలు నిర్వహి స్తున్నాం. నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు, ఇతరత్రా సౌకర్యాలు ప్ర భుత్వం కల్పిస్తుంది. ఆసక్తి గల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ప్లాస్టిక్ కట్టడి ఎలా..?

(5వ పేజీ తరువాయి)

తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు లభించడంతో కూపీ లాగిన సిబ్బంది షాపు వెనకాల ఉన్న మరో బిల్డింగులో మరింత స్టాకు ఉందని తెలుసుకున్నారు. దీంతో వారు అక్కడికి వెళ్లగాషాపు యజమాని సిబ్బందిని దుర్భాషలాడుతూ సానిటరీ ఇన్ స్పెక్టర్‌తో పాటు జవానునుపై భౌతికదాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా వ్యాపారి బూతులు తిడుతూ ఇద్దరిపై మళ్లీ దాడికి య త్నించాడు. దీంతో వెను దిరిగి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దాడికి పాల్పడ్డ వ్యాపారిపై ఫిర్యాదు చేశారు. అయితే చర్యలు చేపట్టకుం డా పోలీసులపై కొందరు ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

చర్యలు తీసుకుంటాం..

బల్దియా కమిషనర్ తౌటం శివాజీ



నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు చేపడతాం. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, అనర్థాలపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు ముందుగా పోస్టర్లు ముద్రించి ప్రచారం నిర్వహిస్తాం. గతంలో దాడులు జరిగి నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్ర యానికి పాల్పడుతున్న వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తాం. అయినా విక్రయాలు ఆపకుంటే ముమ్మర తనిఖీలు నిర్వహిస్తాం. ఇందుకోసం అవసరమైతే ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేస్తాం. బల్దియా పరిధిలో ప్రభుత్వ నిబంధనలు అతిక్ర మించి ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు విక్రయిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతాం.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

జైపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి పుస్తక పఠనం వారధిలా ఉపయోగపడుతుందని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ బుక్ ట్రస్టు సంచార పుస్తక విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డీఈ అమరేందర్, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, తిరుపతి, సత్యనారాయణ, రవీందర్, నేషనల్‌బుక్ ట్రస్టు ఇన్‌చార్జి వినోద్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాండూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో 8వ తరగతి విద్యార్థి మక్సూద్ ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్ షిప్)నకు ఎంపికైనట్లు ప్ర ధానోపాధ్యాయుడు దుర్గం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విద్యార్థిని పాఠశాలలో అభినందించారు. విద్యార్థికి ప్రతి సంవత్సరం రూ 12 వేల స్కాలర్‌సిప్ ఇంటర్ పూర్తయ్యే వరకు వస్తుందన్నారు. అనంతరం విద్యార్థికి ఉపాధ్యాయురాలు సరోజ రూ. 500 నగదు ప్రోత్సాహక బహుమతి అందించారు. ఉపాధ్యాయులు అజీమొద్దీన్, రామన్న, జ్యోతి, భరత్, సత్యనారాయణ, మహేశ్వరి, లత, సత్యవతి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



తాండూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండలంలో ప్లాస్టిక్ కప్పుల్లో టీ అమ్మే షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ మండల ఇన్‌చార్జి దాసరి శ్రీనివాస్ ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అశోక్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. నాయకులు సాలిగామ మల్లేష్, సాలిగామ సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

ఎంపిక



కోటపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్)కు కోటపల్లి మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన తనుశ్రీ, వర్షిణి ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. విద్యార్థినులను శుక్రవారం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ...



లక్షెట్టిపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ఐడీబీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం దుప్పట్లను పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాఘవేంద్రరావు, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మన్ నాయక్, అసిస్టెంట్ మేనేజర్ రాజ్ కుమార్, ఎస్‌వో సత్యనారాయణ మూర్తి ఉన్నారు.

నిరసన..



భీమారం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : భీమారంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కాలనీ వాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. పది రోజుల నుంచి తమ కాలనీలో బోరుమోటారు చెడిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పరీక్షలంటే భయం వీడాలని అప్పుడే విజయం సాధిస్తారని ప్రభుత్వ వైద్యుడు రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ వహించాలని, సమయానికి సరిగ్గా భోజనం చేయాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

వేమనపల్లి : పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఒత్తిడికి గురి కావద్దని స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేష్ సూచించారు. శుక్రవారం వేమనపల్లి ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలు ఎలా రాయాలో అనే అంశంపై అవగాహన కల్పించారు.

తలసేమియా వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చాలి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధి గ్రస్తులకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు లేఖ రాసినట్లు తలసేమియా సికిల్ సెల్ రాష్ట్ర నాయకులు కాసర్ల శ్రీనివాస్ తెలిపారు. ఒక్కొక్కరికి రూ. 10 లక్షల ప్యాకేజీ అమలు చేయా లన్నారు.

బీజేపీలో చేరికలు

వేమనపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్మలపేట గ్రామానికి చెందిన ఎంఆర్‌పీఎస్ మాజీ మండల ఉపాధ్యక్షుడు సీపెల్లి కిశోర్ శుక్రవారం బీజేపీలో చేరారు. చెన్నూరులో నిర్వ హించిన బీజేపీ సమావేశంలో కిశోర్‌కు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మదుకర్, నాయకులు మధునయ్యస్వామి, చరణ్‌రాజ్ పాల్గొన్నారు.

అంతర్గత మూల్యాంకన పరీక్ష మార్కుల పరిశీలన

దండేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్గనూర్, రెబ్బనపల్లి, కోర్విచెల్మ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పదవ తరగతి పరీక్షల అంతర్గత మూల్యాంకన మార్కుల వివరాలపై జిల్లా మానిటరింగ్ బృందం సభ్యులు తనిఖీలు చేపట్టారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ధ్రువ పత్రాలు అందజేశారు. ఆయా పాఠశాల ల ప్రధానోపాద్యాయులు చిన్నయ్య, మంత్రి రాజు, విజయలక్ష్మి, జిల్లా మానిటరింగ్ బృందం సభ్యులు సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటపల్లి : పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల జాబితాల ను బృందం సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జడ్పీహెచ్ ఎస్‌పాఠశాల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను పరిశీలించారు. సభ్యులు జావీద్, సాంబశి వరావు, సంతోష్ పాల్గొని రికార్డులు తనిఖీ చేయగా, హెచ్ఎంలు రాజశేఖర్, కృష్ణమూర్తి, అశోక్ పాల్గొన్నారు.



మార్కుల తనిఖీ చేస్తున్న మానిటరింగ్ సభ్యులు

కులాంతర వివాహాల ప్రత్యేక రక్షణ చట్టం చేయాలి



కులాంతర వివాహాల జంటలను సన్మానిస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కులాంతర వివాహాల కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ అన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని చార్వాక ట్రస్టు హాలులో కులాంతర వివాహాల జంటలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కులాంతర వివాహాల ప్రోత్సాహం కేవలం షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ మాత్ర మే జీవో నెంబరు 12 ద్వారా రూ. 2.50 లక్షలు ఇస్తుందని, బీసీ, మైనార్టీ, ట్రైబల్ శాఖలు ప్రోత్సాహం ఇవ్వడం లేదన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పరిష్కారానికి కృషి

నస్పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగం సమస్యలపై అవగాహన ఉన్నదని, తనకు అవకాశం ఇస్తే ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్ అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో టీఎస్‌యూటీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంత కుమారి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భుజం గరావు, టీఎస్‌ఎస్‌సీఎస్‌టీటీయు రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు బాపు, టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు, పాల్గొన్నారు.

రవీందర్‌సింగ్‌ను గెలిపించాలి


చెన్నూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుడు రవీందర్‌సింగ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని శాతావాహన యూనివర్శిటీ జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమకారుడైన రవీందర్‌సింగ్ గెలుపునకు పట్టభద్రులు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చైతన్య, ప్రశాంత్, నరేష్, అశోక్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

నెన్నెల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యార్థి డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి గెలుపునకు కృషి చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరుకల నర్సింగ్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. మెనిఫెస్టో గూర్చి పట్టభద్రులకు వివరించాలని కోరారు. విద్యా, ఉపాధి, సంక్షేమానికి తమ పార్టీ ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అంగలి శేఖర్, నాయకులు శైలెందర్‌సింగ్, కోట వంశీ, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

చేతి రాత..బాగుంటేనే భవిత

- అందమైన రాతతో అధిక మార్కులు
- అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



దండేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు చేతిరాత బాగుంటే ఏ పరీక్షల్లోనైనా అధిక మార్కులు సాధించవచ్చు. మార్చి 5నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ఉండగా, మార్చి 21నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఎంత చదివామన్నది ఎంత ముఖ్యమో ఎలా రాశామన్నది కూడా అంతే ముఖ్యం. అయితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి మన చేతిరాత ఎలా ఉందనేది కూడా ఆలోచించుకోవాలి.

చిన్నవయస్సు నుంచే అక్షరాలను గుండ్రంగా రాయడం ప్రాక్టీస్ చేయాలి. పరీక్షల్లో అందమైన చేతిరాతతో జవాబులు రాస్తే 10నుంచి 15 శాతం మార్కులు అదనంగా స్కోర్ చేయవచ్చు. మార్చిలో వార్షిక పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో దండేపల్లి మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల చేతిరాతను మెరుగుపరచడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ క్లాసులో విద్యార్థులతో చేతిరాత ప్రాక్టీస్ చేయిస్తున్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులతో పాటు కొంత సమయాన్ని చేతి రాత కోసం కేటాయిస్తున్నారు.

పరీక్షలు రాసేటప్పుడు పాటించాల్సినవి..

- జవాబు పత్రాలపై స్కేల్ సహాయంతో తగిన మార్జిన్ కొట్టాలి.
- జవాబు పత్రంపై పేజీకి 16 నుంచి 18 లైన్లకు మించకుండా రాయాలి.
- పదాలు, వాక్యాలు, పేరాల మధ్య తగిన స్థలం వదలాలి. ఇరికించి ఇరికించి రాయకూడదు.
- అక్షరాల సైజు ఒకే తీరుగా ఉండాలి.
- భాషా దోషాలు లేకుండా చూడాలి.
- ముఖ్యమైన అంశాలు కింద గీత ఉండేటట్టు చూడాలి.
- పరీక్షల్లో ఎట్టి పరిస్థితి ల్లోనూ రెడ్ పెన్ను వాడ కూడదు. బ్లూ లేదా బ్లాక్ పెన్ మాత్రమే వాడాలి.

చక్కటి రాతతో ఎక్కువ మార్కులు

శ్రీనివాస్ దండేపల్లి హైస్కూల్ ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయుడు

పరీక్షల్లోనే కాదు భవిష్యత్తులో ఎక్కడైనా. ఎప్పుడైనా చక్కటి చేతిరాత ఎంతో అవసరం. శాస్త్ర సాకేతికత పెరిగినా చేతిరాతకు ఏమాత్రం ప్రాధాన్యం తగ్గలేదు. విద్యార్థులకు మంచి రైటింగ్ ఉంటే ఎక్కువ మార్కులు సాధించి మంచి గ్రేడ్‌ను సాధిస్తారు. ప్రతి విద్యార్థి రా తపై తగు శ్రద్ధపెట్టి ప్రాక్టీస్ చేయాలి. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటిస్తూ పరీక్షలు రాసి మంచి ఫలితాలు పొందవచ్చును.



న్యాయవాదుల నిరసన

సిర్పూర్(టి), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా 9వ అదనపు కోర్టు మహిళా న్యాయమూర్తిపై నిందితుడు కరణ్‌సింగ్ చెప్పు విసరాన్ని ఖండిస్తూ శుక్రవారం సిర్పూర్(టి) బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గణపతి, న్యాయవాదులు రైస్ అహ్మద్, శంకర్‌రావు, దయారాజ్‌సింగ్, శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, సతీష్, కల్యాణ్, దివాకర్, విజయ్, మతీన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా నిర్మిస్తున్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసే పనుల నిమిత్తం 33 కేవీ కౌటాల ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని ఏఈ రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో లోనవెల్లి సబ్ స్టేషన్ పరిధిలోని కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల్లో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పోస్టర్లు ఆవిష్కరణ

బెజ్జూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న తలపెట్టిన చలో హైదారాబాద్ కార్యక్రమ పోస్టర్లను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చాంద్‌పాషా శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకే ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోశం, శంకర్, సకారాం తదితరులు పాల్గొన్నారు.

భీమాబాయికి ఘన నివాళి

వాంకిడి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శుక్రవారం అంబేద్కర్ తల్లి భీమాబాయి రాంజీ సత్పాల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్, అంబేద్కర్ సంఘం నాయకులు జయరాం, హంసరాజ్, సందీప్, విలాస్, రాజేంద్రప్రసాద్, పాండుజీ, రోషన్, అరుణ్, విజయ్, శ్యాంరావు, దిలాజీ, బలవంత్, ప్రతాప్, రమేష్, రాజేశ్వర్, దేవాజీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కెరమెరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం గడలపల్లి మాజీ సర్పంచ్ గుణవంతరావు భార్య పద్మ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా కెరమెరి మండలానికి చెందిన మాజీ సర్పంచ్‌లు, యువకులు సేకరించిన రూ.19,800 శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మోతిరాం, గోవింద్, జగన్నాథ్‌రావు, కేషన్, తులసీరాం, నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలకు బోధనోపకరణాలు

- వినోదంతో కూడిన బోధనకు చర్యలు
- విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచడమే లక్ష్యం
- మండలానికో వలంటీర్ నియామకం
- ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తే మరింత ప్రయోజనం


బోధనోపకరణ కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు


బోధనోపకరణ పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో ప్రభాకర్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రమాణాల పెంపుకు విద్యాశాఖ తొలి మెట్టులో భాగంగా ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) ఆధ్వర్యంలో బోధనోపకరణాలకు సంబంధించిన కిట్లను పంపిణీ చేస్తోంది. సమగ్ర శిక్ష ద్వారా ఐఐటీ గాంధీనగర్(గుజరాత్) వారు రూపొందించిన ప్రత్యేక కిట్లను కుమురం భీం జిల్లాలోని పాఠశాలల్లో పంపిణీ చేశారు. ఉన్నతాధికారులు ఉపాధ్యాయులకు, ఆసిఫాబాద్‌లోని ఆదర్శ ఉన్నత పాఠశాలల్లో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి కిట్లను అందజేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులకు పాఠ్యంశాలు బోధించే సమయంలో కిట్లలో రంగురంగుల పుస్తకాలు, ఇతర వస్తువులను చూపుతూ బోధిస్తున్నారు. దీంతో పిల్లలకు సులభ రీతిలో అంశాలు అర్థమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. కొవిడ్ తర్వాత విద్యా రంగంపై పెను ప్రభావం పడటంతో విద్యార్థులు గాడి తప్పారు. మళ్లీ గాడిలో పెట్టేందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. విద్యార్థి దశ నుంచి చక్కటి కథలతో నేరుగా బోధిస్తున్నారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. దీని కోసం ఒక వలంటీర్‌ను నియమించారు.

● జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 1,171 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు లక్ష మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో తొలి మెట్టు, ఉన్నత పాఠశాలలో ఉన్నతి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అయినా విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో సామర్థ్యాలు మెరుగు పడడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు గాను ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఎఫ్ఎల్ఎం కింద వండర్ బాక్సులు, ఆరు నుంచి పదో తరగతి వరకు గణిత, సైన్స్ కిట్స్ బాక్సులను అందజేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ 105బాక్సులు, గణిత, ఫిజిక్స్, రసాయం శాస్త్రం బాక్సులు 17, గణిత, సైన్స్ క్యూరియసిటీ బాక్సులు 15 వరకు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానంగా కథల ద్వారా బోధించడంతో సులభంగా అర్థమయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. 6 నుంచి 10 వరకు కూరియాసిటీ బాక్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఈ బాక్సుల్లో గణితం, ఫిజిక్స్‌కు సంబంధించిన త్రికోణాలు, చతుర్భుజాలు, భూ భ్రమణం, రసాయన, భౌతిక శాస్త్రాలకు సంబంధించిన బోధన పరికరాలు అందజేశారు. వీటితో బోధించడం ద్వారా విద్యార్థుల్లో అవగహన పెంచుతున్నారు.

● పక్కాగా అమలైతేనే..

ప్రభుత్వం అందిస్తున్న బోధనోపకరణాల కిట్లను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటేనే మెరుగైన ఫలితాలు రానున్నాయి. గతంలో సమగ్ర శిక్ష ద్వారా అందించిన గణిత, సైన్సు కిట్లను అంతగా వినియోగించడం లేదని చెబుతున్నారు. పర్యవేక్షణ లేక నిరుపయోగంగా ఉన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వివిధ రకాల బాక్కులు అందిస్తున్న విద్యాశాఖ అధికారులు వీటి వినియోగంపై పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులకు వండర్ బాక్సులు..



\- ఉప్పులేటి శ్రీనివాస్, సమగ్ర శిక్షా క్వాలిటీ కోఆర్డినేటర్

ఎఫ్ఎల్ఎన్ ద్వారా ప్రాథమిక విద్యార్థులకు వండర్ బాక్సులు, 6 నుంచి 10 చదివే విద్యార్థులకు కోసం క్యూరియాసిటీ కిట్లను అందజేశాం. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులకు దీనిపై శిక్షణ ఇచ్చాం. ఉపాధ్యాయులు వీటిని సద్వినియోగం చేసుకొని ఫలితాలు సాధించాలి. విద్యార్థులకు అర్థవంతంగా అభ్యసన, సామర్థ్యాలు పెంచేలా బోధించాలి.

పట్టాల కోసం గిరిజన రైతుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన రైతులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములను ఆన్‌లైన్ చేసి పట్టాలు ఇవ్వాలని తిర్యాణి మండలం మంగి (ఎర్రబండ) గ్రామానికి చెందిన గిరిజన రైతులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వారికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సంసదర్భంగా పలువురు మాట్లాడుతూ తాను 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ రికార్డుల నుంచి తొలగించారని చెప్పారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వెంటనే ఆన్‌లైన్‌లో చేర్చి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, కార్తీక్, టికానంద్, కృష్ణమాచారి, రైతులు జంగు, బొజ్జిరావు, ఆత్మారాం, చిత్రు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు


పూడిక తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) గ్రామ పంచాయతీలో శుక్రవారం డ్రైనేజీల్లో పూడికను సిబ్బంది తొలగించారు. 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో 'పారిశుధ్యం.. అస్తవ్యస్తం' అనే వార్త కథనం శుక్రవారం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి స్పందించి డ్రైనేజల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టారు.

దర్గా అభివృద్ధి కమిటీ ఎన్నిక

సిర్పూర్(టి), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని దర్గా అభివృద్ధి కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాలెబీన్ సయ్యాద్, ఉపాధ్యక్షుడిగా అహ్మద్‌బీన్ హుస్సేన్, కార్యదర్శులుగా అబ్దుల్లా మోకీద్, అస్లాం బీన్ అబ్దుల్లా, క్యాషియర్‌గా ముసావీర్ హుస్సేన్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా మునీర్ అహ్మద్ సాహెబ్, అబ్దుల్ రషీద్, అహ్మదుల్లాఖాన్, సోహెల్ అహ్మద్, సభ్యులుగా షేక్ సమీర్, ఎండీ అసద్, వైజ్ హుస్సేన్, సలీంఖాన్, సయ్యాద్ మోహిజ్, మోక్తాదీర్ హుస్సేన్, సైపుద్దీన్, అజ్మత్‌హుస్సేన్, రియాజ్‌ఖాన్, మసీఉర్ రహెమాన్‌ను ఎన్నుకున్నారు.

ప్రత్యేక పూజలు.. అభిషేకాలు


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అభయాంజనేయ స్వామి విగ్రహం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వొజ్జల శిరీష్‌శర్మ నేతృత్వంలో వేదపండుతులు మాడుగుల నారాయణమూర్తి, మహేష్ శర్మ, వారణాసి శ్రీనివాస్‌శర్మ, ఢిల్లీ విజయ్‌కుమార్‌లు స్వామి వారికి ఉదయం 9 గంటలకు కలశ పూజ, స్వస్తీ పుణ్యావాహవచనం, నవగ్రహారాధన, ఏకదవ రుద్రాభిషేకం, స్థాపిక దేవత హవహనం, మన్యసూక్త హవనం, మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం అన్నదాన ప్రదానం నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కోవ సాయినాథ్, ఆలయ కమిటీ ఛైర్మన్, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి వెంకన్న, ప్రచార కార్యదర్శి రాధకృష్ణచారి, డాక్టర్ మధు, శ్రీనివాస్, వెంకటేష్, మురళీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గెలిచినా, ఓడినా ప్రజల వెంటే


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గెలిచినా, ఓడినా ప్రజల వెంటే ఉంటానని, ప్రజల అభిష్టం మేరకే నడుచుకుంటానని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కౌటాల మండలంలోని వీర్దండి గ్రామ సమీపంలో మొగడ్‌దగడ్, బాలెపల్లి, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామస్థులతో నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను మూడు సార్లు గెలిచినా, ఓడిపోయినా ప్రజలలోనే ఉన్నానని గుర్తు చేశారు. ప్రజలకు సేవ చేస్తూ ప్రజాభిప్రాయం మేరకే నడుచుకుంటానని అన్నారు. కేసీఆర్ హయాంలో రూ.75 కోట్లతో మంజూరైన గుండాయిపేట బ్రిడ్జి ఎందుకు రద్దు అయిందో ప్రజలు అడుగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గుండాయిపేట బ్రిడ్జి మంజూరైన జీవో కాపీని ప్రజలకు అందజేశారు. గుండాయిపేట, వీర్దండి, తుమ్మిడిహెట్టి గ్రామాల అభివృద్ధికి , కౌటాల మండల అభివృద్ధికి 13 సార్లు తిరిగి బ్రిడ్జి మంజూరు చేశానని అన్నారు. దీన్ని ప్రసుత్తం రద్దు చేయడం చాలా బాధకలిగించే విషయమని చెప్పారు. పత్తి రైతులను అడ్డంగా దళారులు దోచుకుంటున్నా అధికారంలో ఉన్నవారు దీన్ని ప్రశ్నించడం లేదన్నా రు. తాను నాలుగు గోడల మధ్య కూర్చోని నిర్ణయాలు తీసుకోననిచ ప్రజలతో కలిసి ప్రజాభిప్రాయం మేరకే ముందుకు వెళ్తానని తెలిపారు. గుండాయిపేట వంతెన పూర్తి అయితే ఈ ప్రాంతంలో భూములకు అధిక ధరలు వచ్చేదని చెప్పారు. ఈ విషయంపై రైతులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తాను ఉన్నానన్న విషయం మరిచి పోవద్దని కోరారు. సమావేశంలో దుబ్బుల వెంకన్న, డీసీఎంఎస్ మాజీ వైస్ ఛైర్మన్ మాంతయ్య, నాయకులు మదుకర్, బ్రహ్మయ్య, శ్రీనివాస్, వసంత్, నాజీం, ఓమాజీ, జావీద్, శైలజ గౌడ్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

వాంకిడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని పూలాజీ బాబా ధ్యాన కేంద్రం కమిటీ సభ్యులు అన్నారు. బంబార గ్రామంలో పరమ హంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలాజీ బాబా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ధ్యాన మందిరంలో ధ్వజారోహణ, భజనలు, అన్నదానం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాటాడుతూ పూలాజీ బాబా ధ్యాన మార్గంలోనే ప్రతి ఒక్కరూ నడవాలని చెప్పారు.. కార్యక్రమంలో కృష్ణ, జ్యోతిబా, బెంగాజీ, వాసు, గౌరయ్య, బాబురావు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి


జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

రెబ్బెన, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని కార్మిక కుటుంబాలకు రక్షిత తాగునీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని శుక్రవారం హెచ్ఎంఎస్ సంఘ నాయకులు వైస్ ప్రసిడెంట్ పతెం రాజబాబు, బ్రాంచ్ సెక్రటరి ఎం శివరెడ్డి ఆధ్వర్యంలో జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మిక కుటుంబాలకు ఫిల్టర్ నీరు అందుబాటులో లేక పోవటంతో కార్మికులు చర్మ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ప్రస్తుతం కుళాయిల్లో వస్తున్న నీరు నల్లాగా పేరుక పోతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఆర్గనైజర్ ఇనూస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు ఎన్నికలు రానున్న సందర్భంగా ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ భవనంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటసీ ఎన్నికల నిర్వహణకు నియమితులైన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణతో కలిసి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అధికారులు సమన్వయంతో పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన బీరు ధరలు

» ఎంఆర్‌పీపై 15 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం




చింతలమానేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న వేళ బీరు ధరలు పెరిగాయి. ఎంఆర్‌పీపై 15శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. జిల్లాలో 32 మద్యం దుకాణాలు, మూడు బార్లు ఉన్నాయి. వీటికి మద్యం డిపోల నుంచే మద్యం సరఫరా అవుతున్నది. 2023 మేలో ఒక్కో బీరు బాటిల్‌పై రూ. 10 పెంచిన ప్రభుత్వం 2024లో తగ్గించింది. మళ్లీ ఏడాది గడువక ముందే ఒక్కో బీర బాటిల్‌పై రూ. 20 నుంచి 30 వరకు ధరలను పెంచతూ నిర్ణయం తీసుకుంది.

● మద్యం ప్రియులపై భారం..

ధరల పెంపుతో మద్యం ప్రియులపై భారం పడనుంది. చాలా కాలం నుంచి బీర్ల కంపెనీలు ధరలను పెంచాలని కోరుతుండగా ప్రభుత్వం రెండు రోజుల క్రితం బీర్ల ధరలను 15 శాతం వరకు పెంచింది. దీంతో ఒక్కో బీరుపై 30 రూపాయల వరకు ధరలు పెరిగాయి. 12 బీర్లు ఉన్న పెట్టెపై 350 రూపాయల వరకు ధర పెరిగింది. సరాసరిగా ఒక్కో పెట్టె ధర కంపెనీలను బట్టి 1,800 నుంచి 2,500 రూపాయల వరకు ఉంది. పెరిగిన బీర్ల ధరలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. బీర్ల ధరలు ఇలా ఉన్నాయి. కేఎఫ్ లైట్ పాత ధర 150 రూపాయలు ఉండేది. పెరిగిన ధరతో 172 రూపాయలకు చేరింది. కేఎఫ్ ప్రీమియం 160 ఉండగా 184 రూపాయలకు పెరిగింది. హేవార్డ్స్ ధర 160 రూ పాయలు ఉండగా 184కు, టూబర్గ్ లైట్ 185 ఉండగా 212 రూపాయలకు పెరిగింది. కేఎఫ్ అల్ట్రా 210 ఉండగా 241, బడ్వైజర్ లైట్ 210 ఉండగా 241కు, కేఎఫ్ అల్ట్రామ్యాక్స్ 220కి గానూ 253, బడ్వైజర్ మ్యాగ్నం 220కి గానూ 253, టూబర్గ్ స్ట్రాంగ్ 240కి గానూ 276 రూపాయలకు పెరిగింది.

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం

● మార్చి 5 నుంచి ప్రారంభం ● విద్యార్థులు ఆందోళన చెందకూడదని నిపుణుల సూచన



బెజ్జూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ వార్షిక పరీక్షలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రత్యేక ప్రణాళికతో సన్నద్ధమవుతున్నారు. విద్యార్థి దశలో ఇంటర్ విద్య ప్రధానమైనది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 123మంది ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. మార్చి 5నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు ప్రణాళికతో చదువుతున్నారు. కళాశాలలో ప్రతిరోజు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి మంచి ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేస్తున్నారు. విద్యార్థులు భయాందోళన చెందకూడదని, ప్రణాళికాబద్ధంగా చదవాలని నిపుణులు సూచిస్తున్నారు.

గణితంలో పట్టు కోసం..

\- టాకిరే శిరీష, ఇంటర్ విద్యార్థిని



గణితంలో ఉత్తమ మార్కులే లక్ష్యంగా పట్టుకోసం చదువుతున్నాను. నేను ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. ఉదయం, సాయంత్రం వేళల్లో సబ్జెక్టుల వారిగా సమయం కేటాయిస్తున్నాను.

అధ్యాపకుల సలహాలతో..

\-ఎస్ మేఘన, ఇంటర్ విద్యార్థిని



అధ్యాపకుల సలహాలతో ఉత్తమ మార్కులు సాధించేందుకు చదువుపై దృష్టి సారించాను. బెజ్జూరు కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్నా. సిలబస్‌ను ఎప్పటికప్పుడు అర్థం చేసుకుంటూ సాధన చేస్తున్నా.

ప్రథమ ర్యాంకు సాధనే ధ్యయం..

\- సవిత, ఇంటర్ విద్యార్థిని



బైపీసీ చదువుతున్న నేను కళాశాలలో మొదటి ర్యాంకు కోసం ప్రత్యేక ప్రణాళికతో సిద్ధమవుతున్నా. ఉదయం నుంచి ఒక ప్రణాళిక పెట్టుకొని సాధన చేస్తున్నా. అధ్యాపకుల సలహాలు తీసుకుంటూ సిద్ధమవుతున్నా